అంగడి వేలాన్ని బహిష్కరించిన కాంట్రాక్టర్లు

హుస్నాబాద్‌టౌన్, మార్చి 21: హుస్నాబాద్ పశువుల అంగడివేలం ధర తగ్గించలేదనే కారణంతో కాంట్రాక్టర్లు వేలం పాటను బహిష్కరించారు. హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం అంగడి వేలం పాటను కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అంగడి వేలం పాటను అధికారులు రూ. కోటి 26 లక్షల 27వేల 300ల నుంచి ప్రారంభించారు. పలుమార్లు ఇదేపాటను మున్సిపల్ సిబ్బంది వినిపించినప్పటికీ వేలంలో పాల్గొన్న కాంట్రాక్టర్లు ఎవరూ పాడేందుకు ఆసక్తి కనబర్చలేదు. దీంతో పాట ఎవరైనా పాడాలని అధికారులు పదేపదే విజ్ఞప్తి చేయగా రాజమహేందర్‌రెడ్డి అనే వ్యక్తి రూ. 50లక్షలు పాడగా అధికారులు నిరాకరించారు. దీంతో తాము వేలంపాట పాడమంటూ వారు వెళ్లిపోయేందుకు ప్రయత్నించగా కమిషనర్ జోక్యం చేసుకుని అభ్యంతరాలు ఉంటే తెలుపాలని సూచించారు. వేలం పాటలో జరిగిన విషయాలను జిల్లా అధికారులకు నివేదిస్తామని, మున్సిపల్ నిబంధనల ప్రకారం మరోసారి నిర్వహించి టెండర్ ఖరారు చేస్తామని కమిషనర్ విలేకరులకు తెలిపారు.

జగదేవ్‌పూర్‌లో తైబజార్‌కు వేలం పాట

జగదేవపూర్, మార్చి 21: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ వద్ద శుక్రవారం గ్రామ ప్రత్యేకాధికారి, డీఎల్పీవో లత ఆధ్వర్యంలో తైబజార్‌కు వేలం పాట నిర్వహించారు. పశువుల సంత, కూరగాయల సంతకు వేలం పాట నిర్వహించారు. వేలం పాటలో పశువుల సంతను రూ.52.01లక్షలకు రాజేశం, కూరగాయల సంతకు జగదేవపూర్‌కు చెందిన దాచారం కనకయ్య రూ. 8.70 లక్షలకు దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీవో ఖాజామొహినొద్దీన్, సెక్రటరీ రాంరెడ్డి, మల్‌రెడ్డి గ్రామ నాయకులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబాలకు అండగా ఉంటాం

తొగుట, మార్చి 21: నిరుపేద కుటుంబాలకు అండగా ఉంటామని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి పేర్కొన్నారు. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి సహకారంతో వెంకట్రావుపేటకు చెందిన మక్కల లక్ష్మి,ఈదుగాళ్ల మనోజ్, గోవర్ధనగిరి మధిర చిన్న ముత్యంపేటకు చెందిన తుమ్మల సుభాషిణి, చందాపూర్‌కు చెందిన వర్గంటి సత్యలక్ష్మిలకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందించారు. నాయకులు నంట పరమేశ్వర్ రెడ్డి, సుభాష్‌గౌడ్, రాములు, పిట్ల వెంకటయ్య, నరేశ్, స్వామి పాల్గొన్నారు.

కౌలు రైతు ఆత్మహత్య

వర్గల్, మార్చి 21: ఉరివేసుకొని కౌలురైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గౌరారం ఎస్సై కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన కిష్టనొళ్ల నర్సింహులు (58) హమాలీ పనితో పాటు గ్రామంలో కొంత భూమిని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేసుకుంటూ భార్య, కొడుకు, కూతురుతో కలిసి జీవనం సాగిస్తున్నాడు. 18 నెలల క్రితం కూతురి పెండ్లికి చేసిన అప్పులు భారం కావడంతో మద్యానికి బానిసయ్యాడు. గురువారం రాత్రి కూడా మద్యం తాగి ఇంటికి రావడంతో భార్య అండాలు రోజూ మద్యం తాగితే బతికేదెట్లా? అప్పులు తీరేదెట్లా? అని మందలించింది. దీంతో అతడు కౌలుకు చేస్తున్న భూమి వద్ద చెట్టుకు ఉరికివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తుల సమాచారం మేరకు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడి భార్య అండాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

బాల్యవివాహం చేస్తే చట్టపరమైన చర్యలు

మిరుదొడ్డి, మార్చి 21: మానవ అక్రమ రవాణా జరగకుండా ప్రతిఒక్కరూ బాధ్యతగా ఉండాలని మిరుదొడ్డి ఎంపీడీవో గంగుల గణేశ్‌రెడ్డి, ఐకేపీ ఏపీఎం దాకయ్య అన్నారు. శుక్రవారం ఐకేపీ కార్యాలయంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ, మానవాభివృద్ధి విభాగం ఆధ్వర్యంలో మహిళా సంఘాలకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో బలవంతంగా బాల్య వివాహం చేసేవారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాలికల పట్ల అసభ్యకరంగా వ్యవహరిస్తే పోలీసులకు వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు. ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఐకేపీ సీసీలు, మహిళలు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు అండగా రాజేందర్‌రెడ్డి

కొమురవెల్లి, మార్చి 21: మండలంలోని గురువన్నపేట ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టెన్త్ విదార్థులు పరీక్షా కేంద్రానికి వెళ్లేందుకు బస్సు సౌకర్యం లేక ఇటీవల గురువన్నపేటకు వచ్చిన బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు, బీఆర్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బొంగు రాజేందర్‌రెడ్డి దృష్టికి విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానిక నాయకులు తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన టెన్త్ చదువుతున్న 29 మంది విద్యార్థులకు కొమురవెల్లి మండల కేంద్రంలోని పరీక్షా కేంద్రానికి వెళ్లేందుకు తన సొంత ఖర్చులతో రెండు ఆటోలను సమకూర్చారు. దీంతో టెన్త్ విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు, గ్రామస్తులు బీఆర్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బొంగు రాజేందర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

మర్రిముచ్చాలలో...

మండలంలోని మర్రిముచ్చాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టెన్త్ విద్యార్థులకు కొమురవెల్లి పరీక్షా కేంద్రానికి వెళ్లేందుకు మాజీ ఎంపీపీ తలారి కీర్తనాకిషన్ సొంత ఖర్చులతో రవాణా సౌకర్యం కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

గంగమ్మతల్లికి మంగళ హారతులు

చిన్నకోడూర్, మార్చి 21: మండల కేంద్రంలోని గంగమ్మతల్లికి 23వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో మంగళహారతులు, బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా మంగళ హారతులు, బోనాలను ప్రధాన వీధుల గుండా డప్పుచప్పుళ్లు, శివసత్తుల పూనకాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. కొబ్బరికాయలు కొట్టి, నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం వద్ద భక్తులకు అన్నదానం చేశారు. గంగపుత్ర సంఘం సభ్యులు పాల్గొన్నారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

సిద్దిపేట, మార్చి 21 : సిద్దిపేటలో నిర్వహించే జాబ్‌మేళాను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని బీఆర్‌ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు రెడ్డి యాదగిరి కోరారు. శుక్రవారం సిద్దిపేటలో ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు సహకారంతో ఈ నెల 23న సిద్దిపేట పట్టణంలోని హైదరాబాద్ బైపాస్ విపంచి కళా నిలయంలో మహిళా జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందన్నారు. టెన్త్ పాస్ & ఫెయిల్, ఇంటర్ లేదా ఏదైనా డిగ్రీ, ఐటీఐ, పాలిటెక్నిక్ పాస్ & ఫెయిల్ సర్టిఫికెట్స్ వెంట తీసుకురావాలన్నారు. చిన్నకోడూరు మండల అధ్యక్షుడు రాజు, సిద్దిపేట రూరల్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్, సిద్దిపేట పట్టణ సమన్వయ కర్త రమేశ్, లింగం, సతీశ్, ప్రశాంత్. గాధగోని సాయి గౌడ్, సిబ్బుల సందీప్ పాల్గొన్నారు.

ముదిరాజులకు అడుగడుగునా అన్యాయమే

సిద్దిపేట కమాన్, మార్చి 21 : బడ్జెట్ కేటాయింపుల్లో ముదిరాజులకు అడుగడుగునా అన్యాయమే జరుగుతున్నదని ముదిరాజ్ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. మత్స్యకారులకు సరైన బడ్జెట్ కేటాయించకపోవడంతో శుక్రవారం సిద్దిపేటలో ముదిరాజులు నిరసన తెలిపారు. మేడికాయల వెంకటేశం, తోట్ల పరశురాములు, పడిగే ప్రశాంత్, ఇట్టబోయిన శ్రీనివాస్, పెండెల బాలయ్య, టైగర్ సత్తి, శిలాపురం రాజు, సోషల్ మీడియా కన్వీనర్ సుతారి రాజు, యాట రాజేశ్, సిద్ధరబోయిన శ్రీనివాస్, నాగరాజు, కొంతం శ్రావణ్, లింగం, ప్రశాంత్ పాల్గొన్నారు.

మహిళలు అప్రమత్తంగా ఉండాలి

చేర్యాల, మార్చి 21: మహిళలు అప్రమత్తంగా ఉండాలని సీఐ శ్రీను సూచించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి, మానవ అభివృద్ధి విభాగం స్త్రీ నిధి మండల సమైఖ్య ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణా లైంగిక వ్యాపారం, సైబర్ ఆధారిత అక్రమ రవాణా తదితర అంశాలపై పట్టణంలోని శ్రీనిధి కార్యాలయం ఆవరణలో శుక్రవారం వీసీఏ, వీసీలకు ఒక్కరోజు శిక్షణ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఐ శ్రీను హాజరై మాట్లాడారు. మండల ఏపీఎం ప్రకాశ్, ఎంఎస్ అధ్యక్షురాలు సుజాతపాల్గొన్నారు.

ఆటో బోల్తా..మహిళ మృతి

కొమురవెల్లి, మార్చి 21 : ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో మహిళ మృతి చెందడంతో పాటు పలువురికి గాయాలయ్యాయి. ఈఘటన శుక్రవారం రాత్రి కొమురవెల్లి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. కొమురవెల్లి ఎస్సై రాజు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం వరంగల్ పట్టణం కాశీబుగ్గకు చెందిన సబిత(55) కుటుంబ సభ్యులతో కలిసి కొమురవెల్లి మల్లన్నను దర్శనం చేసుకొని తిరిగి ఆటోలో చేర్యాలకు వెళ్లే క్రమంలో కొమురవెల్లి శివారులోని పద్మశ్రీ గార్డెన్ వద్ద అదుపు తప్పి బోల్తాపడింది. ఆటోలో ప్రయాణిస్తున్న సబిత అక్కడికక్కడే మృతిచెందగా మృతదేహాన్ని చేర్యాల మార్చురీకి తరలించారు. గాయపడిన వారిని సిద్దిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

తాగునీటి కోసం తండ్లాట

- ధూళిమిట్ట హైస్కూల్‌లో తాగునీటి సమస్య
- పాఠశాలలో పాడైన బోరుబావి, మోటర్
- భగీరథ నీటిని ఎరగని బడిపిల్లలు
- సమస్య పరిష్కారం కోసం వేడుకోలు

ధూళిమిట్టలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

మద్దూరు(ధూళిమిట్ట), మార్చి 21: ధూళిమిట్ట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొన్ని రోజులుగా తాగునీటి కోసం విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. సమస్య పరిష్కరించాలని పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకున్న పాపానపోలేదు. దీంతో అరకొరగా అందుతున్న నీటితో విద్యార్థులు సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ధూళిమిట్ట హైస్కూల్‌లో 186 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. వీరికితోడు మరో 20 మంది పాఠశాల సిబ్బంది ఉన్నారు. వీరికి తాగునీరు అందించేందుకు గతంలో ఓ బోరు బావి ఉండేది. మోటర్ బోరుబావిలో పడిపోవడంతో ఆబోరుబావి ఉపయోగంలోకి రాకుండా పోయింది. దీంతో హైస్కూల్ విద్యార్థులు పక్కనే ఉన్న ప్రాథమిక పాఠశాలకు చెందిన బోరు నుంచి తాత్కాలికంగా నీటిని పొందుతున్నారు. ప్రాథమిక పాఠశాల బోరు బావి ద్వారానే హైస్కూల్, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలకు చెందిన 300 మంది పిల్లలకు తాగునీరు అందుతుంది. ఒక్క బోరుతో తగినంత నీటి సరఫరా జరగక పోవడం వల్ల నీటికోసం విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

మిషన్ భగీరథ పైపులైన్ ఏర్పాటులో నిర్లక్ష్యం..

మిషన్ భగీరథ పైపులైన్ ఏర్పాటు చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటం వల్లే హైస్కూల్‌లో తాగునీటి సమస్య ఏర్పడుతున్నదని, పైపులైన్ ఏర్పాటు కోసం మండల స్థాయి అధికారులకు పలుమార్లు చెప్పినా పట్టించుకోలేదని గ్రామస్తులు మండిపడుతున్నారు. వేసవిలో విద్యార్థుల దాహార్తిని తీర్చేందుకు పాఠశాలకు మిషన భగీరథ పైపులైన్ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

స్కూల్‌కు భగీరథ పైపులైన్ వేయాలి



స్కూల్‌లోని బోరుబావి పాడై పోయింది. దీంతో ప్రైమరీ స్కూల్‌కు చెందిన బోరుమోటర్‌పైనే ఆధారపడుతున్నాం. ప్రస్తుతం అరకొరగా నీరు అందుతుంది. ఆనీటినితోనే సరిపెట్టుకుంటున్నాం. భవిష్యత్‌లో నీటి సమస్య తీవ్రం కాకముందే మిషన్ భగీరథ పైపు లైన్ ఏర్పాటు చేయాలి. దీనిపై పలుమార్లు అధికారులకు విన్నవించాం. సంబంధిత శాఖ అధికారులు స్పందించి భగీరథ పైపు లైన్ ఏర్పాటు చేయాలి.

– కరుణాకర్‌రెడ్డి, హెచ్‌ఎం, ధూళిమిట్ట హైస్కూల్

దుబ్బాకలో కోర్టు భవనానికి స్థలం పరిశీలన

కోర్టు కాంప్లెక్స్ భవనానికి స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, జిల్లా జడ్జి

దుబ్బాక, మార్చి 21: దుబ్బాకలో కోర్టు కాంప్లెక్స్ భవన నిర్మాణం చేపట్టేందుకు కావాల్సిన స్థలాన్ని పరిశీలించినట్లు కలెక్టర్ మను చౌదరి తెలిపారు. శుక్రవారం సాయంత్రం దుబ్బాకలో పాత సర్కారు దవాఖానకు సంబంధించిన స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సుప్రీం కోర్టు గైడ్‌లైన్స్ ప్రకారం కోర్టు కాంప్లెక్స్‌కు నాలుగు ఎకరాల స్థలం అవసరం ఉంటుందన్నారు. ప్రస్తుతం కేటాయించిన రెండకరాలతో పాటు పక్కనే ఉన్న సబ్ ట్రెజరీ కార్యాలయానికి (ప్రభుత్వానికి) చెందిన స్థలం అవసరం పడుతుందన్నారు.ఇంతకు ముందు కేటాయించిన స్థలంతో పాటు పక్కన ఉన్న మరో రెండు ఎకరాల స్థలాన్ని జిల్లా జడ్జి సాయి రమాదేవి, ఆర్డీవో సదానందం, ఆర్ అండ్‌బీ అధికారులతో కలిసి పరిశీలించినట్లు తెలిపారు.

మిస్ వరల్డ్ పోటీల్లో చేర్యాల పెయింటింగ్స్ ప్రదర్శన

మేళాలో పెయింటింగ్స్‌ను పరిశీలిస్తున్న ప్రపంచ సుందరి తదితరులు

చేర్యాల, మార్చి 21: మిస్ వరల్డ్ పోటీల సందర్భంగా చేర్యాల పెయింటింగ్స్ కళాకారులకు నిర్వాహకులు అభినందనలు తెలిపారు. ప్రపంచ అందాల పోటీలు మే 7 నుంచి 31వ తేదీ వరకు రాష్ట్రంలోని 20 ప్రాంతాల్లో 24 ఈవెంట్లను ప్రభుత్వం నిర్వహించనున్నది.140 దేశాల నుంచి ప్రతినిధులు హాజరుకానున్న 72వ మిస్ వరల్డ్ పోటీలో చేర్యాల పెయింటింగ్స్ మేళా ఏర్పాటు చేయాలని పర్యాటక శాఖ నుంచి ఆహ్వానం వచ్చింది. చేర్యాలకు చెందిన చిత్రకారులు పసుల మల్లేశం, పసుల మంగ దంపతులు తయారు చేసిన ట్రెడిషనల్ చిత్రాలు, బొమ్మలను హైదరాబాద్‌లోని ప్రపంచ అందాల పోటీలు నిర్వహించే ప్రాంతంలో మేళాలో ప్రదర్శించారు. పోటీలకు వచ్చిన అందాల భామలతో పాటు ప్రేక్షకులు సైతం వాటిని కొనుగోలు చేయడంతో పాటు చేర్యాల పెయింటింగ్స్ చిత్రకారులైన మల్లేశం దంపతులను 2024 ప్రపంచ సుందరి క్రిసిటనాపిజ్కోవా అభినందించారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రజ్ఞాపూర్ గ్రామస్తులు

గజ్వేల్, మార్చి 21: మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్ 3, 4, 15, 16 వార్డుల్లో నెలకొన్న తాగునీటి సమస్యను త్వరగా పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్యకు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. కొద్దిరోజులుగా ఇంటింటికీ మిషన్ భగీరథ తాగునీళ్లు రావడం లేదన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా నీటి తీవ్రత ఏర్పడిందని, అందుకు అధికారులు సమస్యను దృష్టిలో ఉంచుకొని ప్రతిరోజూ సరిపడా తాగునీళ్లు వచ్చేలా చూడాలన్నారు. కార్యక్రమంలో మర్కంటి కనకయ్య, ఎక్కలదేవి కనకరాజు, డాకని భిక్షపతి, మన్నె వెంకటేశ్, సాయిబాబా, మహేందర్‌రెడ్డి, ఎల్ల శ్రీనివాస్, రాజు, మల్లేశంగౌడ్, తుమ్మ శ్రీనివాస్, షరీఫ్, యాకూబ్, ప్రభు పాల్గొన్నారు.

అధిక సాంద్రత పత్తిసాగుపై దృష్టి సారించాలి

రాయపోల్‌లో రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యవసాయధికారి రాధిక

రాయపోల్, మార్చి 21: అధిక సాంద్రత పత్తి సాగుపై దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయాధికారి రాధిక రైతులకు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతువేదికలో అధిక సాంద్రత పత్తి సాగుపై రైతులకు ఆమె అవగాహన కల్పించారు. అధిక సాంద్రత పద్ధతిలో చీడపీడలు, యాజమాన్య పద్ధతుల గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సస్యరక్షణ చర్యలపై రైతులకు సూచించారు. అనంతరం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ నాల్కర్, రవి,అగ్రానమీ శాస్త్రవేత్త ప్రతాప్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో గజ్వేల్ డివిజన్ వ్యవసాయ శాఖ ఏడీఏ బాబునాయక్, మండల వ్యవసాయాధికారి నరేశ్, వ్యవసాయ విస్తణ అధికారులు రజిత, కవిత, ప్రవీణ్, స్వర్ణలత, వివిధ గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన

గజ్వేల్, మార్చి 21: గజ్వేల్‌లోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. ఈమేళాలో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు, డిగ్రీ పూర్తయిన నిరుద్యోగులు పాల్గొన్నారు. ఉద్యోగాల ఎంపికలో పాల్గొన్న అభ్యర్థులకు టెక్ మహేంద్ర, ముత్తూట్ ఫైనాన్స్, ఎల్ఐసీ, శ్రీరామ్ ఫైనాన్స్, యాక్సిస్ బ్యాంకు, ఐసీఐసీఐ బ్యాంకు, స్వాన్ బిజినెస్ ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులైన వారిని ఎంపిక చేశారు. సుమారు 70మంది వివిధ ఉద్యోగాలకు ఎంపిక కాగా మరో 118మంది ఇతర ఉద్యోగాల్లో షార్ట్‌లిస్ట్ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ అనితాఅబ్రహం, కంపెనీల నిర్వాహకులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మందకృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం

హుస్నాబాద్‌లో నినాదాలు చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

హుస్నాబాద్‌టౌన్, మార్చి 21: ఎస్సీవర్గీకరణకు కృషిచేసిన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ చిత్రపటానికి శుక్రవారం హుస్నాబాద్‌లో క్షీరాభిషేకం నిర్వహించి, స్వీట్లుపంపిణీ చేశారు. స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతున్న వర్గీకరణ బిల్లుకు అసెంబ్లీ ఆమోదం తెలుపడంపై సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీకౌన్సిలర్ గాదపాక రవీందర్, సాంస్కృతిక విభాగం రాష్ట్ర కోఆర్డినేటర్ ముక్కెర సంపత్‌కుమార్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు అశోక్, నాయకులు రాజశేఖర్, వినోద్, బాలు, రాములు, సాయులు జగ్జీవన్, రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పద్మశాలీలు ఎదగాలి

సిద్దిపేట టౌన్,మార్చి 21 : పద్మశాలీలు ఉన్నతంగా ఎదగలని పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కస్తూరి సతీశ్ పిలుపునిచ్చారు. ఇటీవల అదనపు పీపీగా నియామితులైన సాదుల ఆత్మరాములను శుక్రవారం సంఘం పరంగా సన్మానించారు. కార్యక్రమంలో నేతలు భిక్షపతి, ముదిగొండ శ్రీనివాస్,సాయిబాబా,శ్రీశైలం, ఆగయ్య, దయాసాగర్,ప్రభాకర్,వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఆనంద నిలయాన్ని సందర్శించిన కలెక్టర్

కొండపాక(కుకునూరుపల్లి), మార్చి 21: కొండపాక శివారులోని ఆనంద నిలయాన్ని శుక్రవారం కలెక్టర్ మనుచౌదరి సందర్శించారు. ఈ సందర్భంగా ఆనంద నిలయంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కలెక్టర్‌కు ఆలయ పూజరులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆనంద నిలయంలో వృద్ధాశ్రమాన్ని సందర్శించి వృద్ధులతో మాట్లాడారు. అనంతరం బాలసదనంలోని చిన్నారులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ప్రధాన రహదారి నుంచి ఆనంద నిలయం వరకు రోడ్డు నిర్మించాలని ట్రస్ట్ సభ్యులు కోరగా స్పందించిన కలెక్టర్ తాత్కాలికంగా గ్రావెల్ రోడ్డు నిర్మించాలని పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కొండపాక తహసీల్దార్ దిలీప్‌కుమార్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఆనందనిలయం ట్రస్టు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆనంద నిలయంలో చిన్నారులతో కలెక్టర్ మనుచౌదరి

టెన్త్ పరీక్షలు షురూ..

– తొలిరోజు 99.91 శాతం మంది విద్యార్థులు హాజరు
– పలు కేంద్రాలను సందర్శించిన కలెక్టర్, సీపీ

సిద్దిపేట అర్బన్, మార్చి 21: జిల్లా వ్యాప్తంగా శుక్రవారం టెన్త్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. 79 పరీక్షా కేంద్రాల్లో 14,114 మంది విద్యార్థులకు 14,101 మంది హాజరు కాగా.. 13 మంది గైర్హాజరై 99.91 హాజరు శాతం నమోదైంది. జిల్లా కేంద్రంలోని పలు పరీక్షా కేంద్రాలను కలెక్టర్ మను చౌదరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. వేసవి కాలం కావున విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, ఫ్యాన్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులు, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలు కల్పించాలని సూచించారు. మాస్‌కాపీయింగ్‌కు అవకాశం లేకుండా పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. సిద్దిపేట పోలీస్ కమిషనర్ బి.అనురాధ జిల్లా కేంద్రంలో పలు పరీక్షా కేంద్రాలను పరిశీలించి బందోబస్తు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బందికి సూచనలు చేశారు. పరీక్షలు జరిగే సమయంలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు.

సిద్దిపేట అర్బన్: ఇందిరానగర్ ప్రభుత్వ పాఠశాలలో..

సిద్దిపేట అర్బన్: సిద్దిపేటలో సీపీ అనురాధ

మిరుదొడ్డిలో పరీక్షా సెంటర్‌కు వెళ్తున్న విద్యార్థులు

మద్దూరులో వీల్‌చైర్‌లో పరీక్షకు హాజరైన విద్యార్థి

హుస్నాబాద్‌టౌన్: హుస్నాబాద్‌లోని పరీక్షా కేంద్రం వద్ద..

సిద్దిపేట అర్బన్: సిద్దిపేటలో పరీక్ష తీరును పరిశీలిస్తున్న కలెక్టర్

చేర్యాల పరీక్షా కేంద్రం వద్ద ..

కొమురవెల్లి: పరీక్షా కేంద్రంలోకి క్యూలో వెళ్తూ...

దుబ్బాక: ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో...

మొక్కలు నాటి సంరక్షించాలి



జగదేవ్‌పూర్, మార్చి 21: భవిష్యత్ తరాల కోసం ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని డీసీసీబీ డైరెక్టర్ అంజిరెడ్డి అన్నారు. శుక్రవారం రాజ్యసభ సభ్యుడు జోగినిపల్లి సంతోష్‌కుమార్ చేపట్టిన గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా జగదేవపూర్ మదనదుర్గమ్మ వద్ద బీఆర్‌ఎస్ నాయకుడు మహేందర్‌రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకొని మొక్కలు నాటారు. కార్యక్రమంలో హరితసేన గజ్వేల్ ఇన్‌చార్జి అనిల్ మొగిలి, సిద్దిపేట హరితసేన ఇన్‌చార్జి రాజేశ్వర్‌రావు, బలింపురం మాజీ ఎంపీటీసీ లింగారెడ్డి, గ్రీన్ ఇండియా మైలరం గ్రామ కోఆర్డినేటర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

మద్దూరు(ధూళిమిట్ట), మార్చి 21: మద్దూరు మండలం రేబర్తి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం ఎంపీడీవో రామ్మోహన్ ప్రారంభించారు.ఎంపీవో వీరరాజు, పంచాయతీ కార్యదర్శి మాధవ్‌జాదవ్, ఎఫ్‌ఏ ఐలయ్య, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్‌ఎం, ఆశకార్యకర్తలు, మహిళా సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేటలో....

సిద్దిపేట, మార్చి 21 : సిద్దిపేటలోని సూర్య డయాగ్నోస్టిక్స్ ఆధ్వర్యంలో డాక్టర్ మంచాల సందీప్‌కుమార్ సహకారంతో 6,23,24 వార్డుల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులారాజనర్సు చలివేంద్రాలను ప్రారంభించారు. కౌన్సిలర్లు నాయకం లక్ష్మణ్, ఎడ్ల అరవింద్‌రెడ్డి, వడ్లకొండ సాయికుమార్, దవాఖాన సిబ్బంది పాల్గొన్నారు.

వేధింపులు అరికట్టాలి

జగదేవ్‌పూర్, మార్చి 21: మహిళలపై వేధింపులు అరికట్టాలని మండల అభివృద్ధి అధికారి రాంరెడ్డి, ఎస్సై చంద్రమోహన్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఐకేపీ భవనంలో మానవ అక్రమ రవాణా శిక్షణలో భాగంగా మహిళా సంఘం సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులు చెప్పే మాయ మాటలు పట్ల అప్రమ్మంగా ఉండాలన్నారు. బాల్యవివాహాలు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఏపీఎం కిరణ్, సీసీలు సీఏలు, వీఏలు, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కార్యదర్శిపై ఫిర్యాదు

మద్దూరు(ధూళిమిట్ట), మార్చి21: మద్దూరు మండలంలోని ధర్మారం గ్రామ పంచాయతీ కార్యదర్శి అశోక్‌పై ఎంపీడీవో రామ్మోహన్‌కు శుక్రవారం పలువురు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలో చెత్త సేకరణ అధ్వానంగా తయారైందన్నారు. చెత్త సేకరణకు ట్రాక్టర్ గ్రామంలో తిరగడం లేదని విమర్శించారు. గ్రామంలో పైపులైన్ లీకైన మరమ్మతులు చేపట్టకుండా పంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు.

పరిస్థితి విషమించి వ్యక్తి మృతి

మిరుదొడ్డి, మార్చి 21 : పరిస్థితి విషమించి వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని కాసులాబాద్‌లో చోటు చేసుకుంది.. మిరుదొడ్డి ఎస్సై బి.పరశురాములు వివరాల ప్రకారం..గ్రామానికి చెం దిన బిట్ల రాములు (58) గురువారం చింతపండు దులుపడానికి చెట్టు ఎక్కి ప్రమాద వశాత్తు కాలుజారి చెట్టుపై నుంచి కింద పడ్డాడు. బాధితుడిని108లో సిద్దిపేట ఏరియా దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో డాక్టర్ల సూచనమేరకు లక్ష్మక్కపల్లిలోని ఆర్‌వీఎం దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం మృతి చెందాడు. మృతుడి భార్య మరియమ్మ మృతి చెందగా ముగ్గురు కూతుళ్ల పెళ్లిళ్లు అయ్యాయి. వరుసకు అన్న మల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎసై తెలిపారు.

PUBLIC NOTICE

General public is hereby informs my client namely Sana Ravi s/o.yadagiri, aged. 55 Years, Occ: agriculture R/o. Yellareddypet village and Mandal of Rajanna siricilla Dist.TS.
My client says that on 10th March 2025, while travelling by bike, from his house to Yellareddypet old Bus stand. My client purchased land from Mankala Mallesham S/o.Nagaiah through Regd.Sale docummet No.6978/2005/I/1709, dated. 19/11/2005, SRO Siddipet, Survey No.55, plot No-4, extent an area 121 yards. Santhosh nagar-siddipet locality,
Boundaries as: North: Open land of Balije Nagaiah & Rajireddy. South: Open
Plot No. 3 & 6 East: 21 feet Road, West: 5th plot the original link Regd.Sale document No.2001/1986/book-1 of SRO 1709 Siddipet on the name of Budime Thirupathi s/o Durgaiah purchased from MD Shamshoddin s/o. Hussen the above said link document lost at Yellareddypet old bus stand and not traced out, later my client given police complant. If any one find the above link documents please hand over to my client or my office and reward will be paid.
Sd/- PASULA KRISHNA
BADE KANTHAIAH &
Advocates
Sircilla Cell: 9666033436 , 9618789371